


**నవ్వించే కథ**

**సి.కృష్ణకుమారి శాస్త్రి**

# సీతాపతి-గరిటే గతి

పెళ్ళైన పదిరోజులపాటు కొత్త ప్రణయలోకంలో విహరిస్తూ పెళ్ళాన్ని ఫైవ్‌స్టార్ హోటళ్ళ స్థాయినుంచి డాబా హోటళ్ళు, ఫుడ్‌ప్లాజాలు అనే తేడా లేకుండా తిప్పిన చోట తిప్పకుండా తిప్పుకొచ్చాడు సీతాపతి.

పదకొండో రోజున పాకెట్‌లోని పర్సు బరువు తగ్గడంతో మనసు ఇంటి వంట మీదకు మళ్ళింది.

తనకిష్టమయిన మామిడికాయ, దోసకాయ, గోంగూర లాంటి పప్పులు, పనసపొట్టు, అరటికాయ లాంటి ఆవపెట్టిన కూరలు, ఇంగువ పోపు పెట్టి చేసే రోటి పచ్చళ్ళు, ములక్కాడ సాంబారు, మజ్జిగ పులుసు కళ్ళ ముందు కదలాడుతుంటే- మర్నాటి నుంచి వంట మనింట్లోనే, సరుకుల లిస్టు రాయమని భార్యకు చెప్పాడు.

ప్రణయపుమత్తులోంచి బయటపడి ఒక్కసారిగా పెద్ద ప్రళయం సంభవించినట్లుగా చూశాడు సీతాపతి, భార్య పేల్చిన బాంబులాంటి వార్త విని.

"నిజంగా" అన్నాడు నమ్మలేనట్లుగా చూస్తూ.

"అవునండి! నిజంగానే. నాకు అసలు వంట రాదు" అంది కుందన.

ఒక్కక్షణంపాటు, బెల్లం లేకుండా చేసిన కాకర కాయ కూర తిన్నంత చేదు అన్పించి ఖంగుతిన్నా, మరుక్షణమే తేరుకుని చిరునవ్వుతో...

"మరేం ఫర్వాలేదు. ఓ వారం రోజులపాటు **కుకింగ్ క్లాసులు యిస్తాను తీసుకో. నా కోచింగ్‌లో** మంచి రాంక్ సంపాదిస్తావు" అన్నాడు విదేశాల్లోని చైల్డ్ బర్త్ క్లాసులు గుర్తుకొచ్చి.

ఆ వుడకని కందిపప్పు కబుర్లు తన దగ్గర కాదు అన్నట్లుగా చూసింది కుందన గౌరి.

ఎందుకు అన్నట్లుగా తను చూశాడు సీతాపతి.

అసలు తమ వంశంలో ఆడవాళ్ళెవరు వంటగది ఛాయలకు కూడా వెళ్ళరని వంట గండం వుందని చెపుతున్న ఆమె మాటలకు పక పకా నవ్వుతూ..."వంట గండమా? ఇదేదో కొత్తగా వుందే! రకరకాల గండాల గురించి విన్నాను కాని ఇలాంటి పేరెప్పుడూ వినలేదే! వూ చెప్పు చెప్పు" అన్నాడు ఆసక్తిగా!

పెళ్లయి కొత్తగా కాపురానికెళ్ళిన తరాల నాటి తాతమ్మ కట్టెల పొయ్యి అంటిస్తుండగానే అంటుకొని ఆ కట్టెలలోనే కాలిపోయిందని, ఇంక నానమ్మ కిరోసిన్ స్టవ్ పంప్ చేస్తూ పగిలి ఆవిడా పోయిందని, మా అమ్మ కూడా, గాస్ స్టవ్ ప్రమాదానబడి ఎలాగో సేవ్ అయిందని, ఆనవాయితీగా వస్తున్న ఈ అగ్నిప్రమాదాల బారిన పడకుండా తననసలు వంట గది ఛాయలకు కూడా రానివ్వకుండా పెంచారని...అమ్మ వండి పెడితే తినిపెట్టేదాన్నన్న నిజాన్ని తియ్యగా చెప్పింది కుందనగౌరి.

"మరా విషయం పెళ్ళిచూపుల నాడే ఎందుకు చెప్పలేదు?" అన్నాడు కోపంగా సీతాపతి.

"మీరు నన్నా ప్రశ్న అడిగితేకదా నేను చెప్పేటందుకు" అన్న భార్య బదులుకి నెత్తిన కొబ్బరికాయ పడి బొప్పికట్టినట్లయింది సీతాపతికి.

అసలు పెళ్ళిచూపులనాడు అమ్మ అననే అంది.

"అమ్మాయికి వంటొచ్చా అని అడుగుతావ్రా సీతా" అంటే తను పడనిచ్చాడు కాదు.

"ఇంకా, ఈ పాత చింతకాయ పచ్చడి ప్రశ్నలేమిటమ్మా. ఈ రోజుల్లో అమ్మాయిలు అన్నిటా ముందున్నారు. చదువుకు చదువు, వంటకు వంటా" అని ఆవిడ నోరు మెదపనిచ్చాడు కాదు.

పేరుకు తగ్గట్టుగానే కుందనంలాగా వుందని కుందనగౌరిని తొలిచూపులోనే ఓకే చేశాడు.

పని లేకుండా తిని కూర్చుంటే గుమ్మటంలా ఏమిటి, గున్నఏనుగులా కూడా తయారవుతారు.

జరిగిన ఘోరానికి కోపం ముంచుకొస్తున్నా ఏం అనలేదు. దానికి కారణం అమ్మే.

**కొత్తగా కాపురానికెళ్ళే ఏ అమ్మాయికయినా తల్లి** మంచిచెడులు చెపుతుంది. కానీ రివర్స్‌గా అమ్మ తనకు సూక్తులు చెప్పింది. మన వంశంలో ఏ మగాడు కూడా చెప్పాలంటే మీ ముత్తాతల తరంనుంచి, మీ నాయన వరకు పెళ్ళాల్ని పల్లెత్తుమాట కూడా అనకుండా నెత్తిన పెట్టుకుని చూసుకున్నారని, నువ్వు కూడా వాళ్ళనే అనుసరించాలని- కుందనగౌరి కంట కన్నీరు రప్పించరాదని చేతిలో చెయ్యి వేయించుకుంది.

కొత్త పెళ్ళాం మోజులో తను వెనకా ముందు చూడకుండా మాటిచ్చాడు.

తాంబూలాలిచ్చేశాను తన్నుకు చావడన్నట్లుగా వంశగౌరవం కోసం మాటిచ్చాక మరింక చేసేదేముంది. ఎరక్కపోయి మాటిచ్చి ఇరుక్కుపోయినట్లయింది సీతాపతి పని.

గట్టిగా నోరు విప్పి అనటానికి లేదాయె.

బ్రహ్మచారి పోస్టు నుంచి గృహస్తుగా ప్రమోషను వచ్చి ఓ ఇంటివాడయినా, తన చేతి గరిటెకి మాత్రం ప్రమోషను లేదులా వుంది.

సీతాపతి-చాపేగతి అన్న సామెతకు బదులుగా సీతాపతి-గరిటే గతి అన్న కొత్త సామెత తనపరంగా వస్తుందని కలలో కూడా వూహరాలేదు.

జీవితాంతం ఈ గరిటె జీవితం తనకు తప్పదా.. ఆ ఆలోచనతో ఒళ్ళంతా చెమటలు పట్టినట్లయింది సీతాపతికి.

పోనీ, నయగారంగా చెప్పి భార్యకు వంట గది ప్రవేశం చేయిద్దామా అనుకుంటే తన చిన్నప్పుడు అమ్మమ్మ అన్నమాటలు గుర్తుకు వచ్చాయి.

"ఒరేయి సీతగా నీకు తల్లో రెండు సుళ్ళున్నాయిరా, నీకిద్దరు పెళ్ళాలు ఖాయం" అనేది.

అట్లాగే కుందనగౌరి వంశం తాలూకు వంటగండానికి, నిజంగానే పవరుండి ఏదన్నా జరగరానిది జరిగితే?

అమ్మో! ఆ ఆలోచన విరమించుకున్నాడు.

పేపర్లో కొత్తపెళ్ళికూతుళ్ళు, వాళ్ళ చావులు, పోలీసులు, కేసులు గుర్తుకు వచ్చి..

గతంలో బ్రహ్మచారిగా అందరిళ్ళల్లో తిన్నవాడయి వుండటం వల్ల, పెళ్ళాం కాపురానికి రాగానే,

ఒక్కొక్క సండే ఒక్కొక్క ఫామిలీని పిలిచి మరీ విందు చెయ్యాలనుకున్నాడు.

తనకే పెళ్ళాం చేతి వంట గతి లేదు. ఇంక వాళ్ళనేం పిలుస్తాడు.



పెళ్ళి కుదిరింది మొదలు ఎంతగానో సంతోషించాడు. ఈ వంట బాధ, వంటి బాధ తప్పుతుంది పెళ్ళాం వచ్చి క్రమంగా వండి వడ్డిస్తుందని, సుఖపడవచ్చునని ఆశపడ్డాడు. మొదటి ఆశమాత్రం అడియాసే అయింది.

"ఎందుకండి అనవసరంగా వర్రీ అవుతారు. వూరంతా కర్రీ పాయింట్లు పెట్టుకుని'' అంది కుందన గౌరి.

గుర్రు గుర్రున చూస్తూ "పెళ్ళాన్ని ఇంట్లో పెట్టుకుని కర్రీపాయింట్ల వెంట తిరిగే ఖర్మ నాకేం పట్టలేదు. కట్నంగా మీ నాన్న ఓ కర్రీ పాయింటిస్తే బాగుండేది" అన్నాడు అనాలోచితంగా ఆవేశంతో.

"మీరు నోరు తెరిచి అడక్కుండానే అక్షరాలా అయిదు లక్షల రూపాయలు కట్నంగా ఇచ్చాడు. అప్పుడే మర్చిపోయారా?" అంది.

అడక్కుండా యిచ్చిన కట్నం తిరకాసుకి అర్థం యిదన్నమాట.

'అమ్మనా మావా! ఎంత లాజిక్ మైండ్ నీది' అన్నట్లుగా ముక్కున వేలు వేసుకున్నాడు సీతాపతి.

ఏది ఏమయినా కుందనగౌరికి వంట రాదన్న విషయాన్ని అమ్మా-నాన్నకి, బంధువర్గాలకి తెలియకుండా వుండేలోపుగానే ఈ సమస్యకు పరిష్కారం వెతకాలనుకున్నాడు.

సమయానికి అమ్మా-నాన్నా, అత్తా-మావలు కూడా వూళ్ళోలేరు. అంతా కట్టకట్టుకుని యాత్రలకు పోయారు.

ఇంటిపని, ఆఫీసు పని రెండు చెయ్యటం తన వల్ల కావటం లేదు. ఎక్కువ రోజులు చెయ్యి కాల్చుకోలేక

పోయాడు.

ప్రస్తుతం ఈ గండం నుంచి గట్టెక్కాలంటే తమ దూరపుబంధువయిన ఒక్క గన్నవరం గండాలత్తయ్యే దిక్కు.

వెంటనే రమ్మని పిలుపు పంపించాడు.

ooo

చిటికేస్తే చాలు వచ్చేస్తానన్నట్లుగా సంచి చంకలో పెట్టుకుని, చేత్తో సెల్ పట్టుకుని యమర్జన్సీగా లాండ్ అయింది మర్నాటి కల్లా గండాలత్తయ్య.

ఆవిడ అసలు పేరు క్రిష్ణవేణమ్మే అయినా ఎవరికే ఆపద వచ్చినా పిలవని వాళ్ళది పాపం అన్నట్లుగా వచ్చి వాలిపోతుంది. తమ గండాల్ని కాస్తుందని ఎవరో ఈ పేరు పెట్టారు. దాంతో అసలు పేరు మరుగున పడి ఆవిడకా పేరు సార్థకమయి కూర్చుంది.

చిన్నప్పుడే భర్త పోవటంతో సంసారం, సంతానం అన్న బాధ్యతలకు దూరం అయిన ఆవిడకు కష్టం, సుఖం అనే మాటలకు అర్థం ఏమిటో తెలియకపోవటంతో వంట సామాను, సరుకులు ఇంటినిండుగా వున్నాయంటే వుత్సాహంతో వూగిపోతుంది.

అవసరం ఎంత అన్న ఆలోచన లేకుండా వండి పడేస్తుంది.

మిగిలినవి అవలీలగా అవతల పారేస్తుంది.

చేతివాటం, నోటిధాష్టీకం ఎక్కువని తెల్సినా తప్పనిసరిగా అవసరం రావటంతో పిలిపించాడు సీతాపతి.

ఆరు రోజులపాటు గండాలత్తయ్య చేతి వంటతో జిహ్వ లేచివచ్చినట్లుగా అన్పించింది సీతాపతికి.

చెప్పాలంటే ఆవిడ చేసే ప్రతి పదార్థం కూడా అతగాడి నోటికి పిండివంటల్లా మహారుచిగా అన్పించాయి.


వండాలంటే కష్టంగాని, వండింది తిని పెట్టటం అలవాటున్న కుందనగారికి హాయిగా వుంది.

ఏడవరోజు మాత్రం ఏడుపు ముఖం పెట్టక తప్పలేదు సీతాపతి. కారణం, నెలరోజుల గ్రాసాన్ని, వారం రోజులకే అయిందనిపించి సరుకుల చిట్టాతోపాటు, తన పర్సనల్ చిట్టా అంటూ రెండు చీటీలు అతగాడి చేతిలో పెట్టింది గండాలత్తయ్య.

ఇంటి చిట్టా పరికించిన సీతాపతి ఈ సరుకులు వంటకా లేక ఏదన్నా చిల్లరకొట్టు పెట్టటానికా అనుకున్నాడు.

ఏకంగా ఓ బస్తాబియ్యం, పదికేజీల కందిపప్పు, ఓ నూనెడబ్బా, రెండు కేజీల జీడిపప్పు, అయిదుకిలోల నెయ్యి, మిగతా సరుకులు కూడా ఏ ఒక్కటీ కిలోకి తక్కువ కాకుండా వరసగా కన్పించాయి.

ఇంక పర్సనల్ చిట్టావిప్పితే రెండు కేజీల ఆవు నెయ్యి, ఓ అరటిపళ్ళ గెల, పాతిక కొబ్బరికాయలు, పదికట్టల వత్తులు, ఓ పంచెల చాపు, ఇంకా ఏవేవో పూజా ద్రవ్యాలు.



## అందగత్తె వంటలు

కమల్ హాసన్ కూతురు శృతి మంచి గాయనిగానే కాకుండా ఇటీవల బాలీవుడ్‌కి పరిచయమై నటిగా కూడా పేరు తెచ్చుకుంది. త్వరలోనే సంగీత దర్శకురాలిగా కూడా 'ఈనాడు' సినిమాతో పరిచయమవుతోంది శృతి. ఇందులో కమల్-వెంకటేష్ నటిస్తున్నారు. తనకి నటన, గానమే కాదు, వంటలు చేయడం కూడా బాగా వచ్చుంటుంది శృతి. తన ఫ్రెండ్స్, బంధువుల సర్కిల్‌లో తన చేతి వంట గురించి మంచి పాపులారిటీ వుందని గొప్పగా చెబుతుంది శృతి. నోరూరించే వంటలు చేయడం తన స్పెషాలిటీగా చెప్పుకుంటుందామె.

ఒక్కసారిగా అతడి కళ్ళు పచ్చపడ్డట్లుగా అయి నోట మాట రాక ఏమిటీ చిట్టాల వరస అన్నట్లుగా చూశాడు గండాలత్తయ్య వంక.

"వచ్చేది కార్తీకమాసం కదురా అబ్బాయి ఉపవాసాలు వ్రతాలు, పూజలు వుంటాయి. కాసింత ఖర్చు మాసమే మరి. మళ్లీ మళ్లీ బజారుకి ఏం తిరుగుతావని ఒక్కసారిగా రాశాను. ప్రస్తుతానికివి తీసుకురా. ఏదన్నా తక్కువయితే మళ్ళీ చెపుతాలే"

"కార్తీకమాసం నాలుగు సోమవారాలు, ఏకాదశి వుపవాసాలు వుండి తీరాలి. ఉపవాసంతో వుదయం నుండి పీక ఎండిపోయి వుంటుందా, దండిగా పిండి వంటలతో భోజనం లేకుండా వుంటే ఏం బాగుంటుంది. పౌర్ణమినాడు మీ దంపతుల చేత సత్యనారాయణ వ్రతం చేయించాలా, హీనపక్షం ఓ యాభైమంది పై చిలుకు నీ ఇంట్లో చెయ్యి కడగాలా?

నెలాఖరుకి కార్తీక సమారాధన వుండనే వుందయ్యే...చూడు నాయనా సీతాపతీ ఈ మాసంలో దానం, ధర్మం ఎంత చేసుకుంటే అంత మంచిదనుకో"

'అవును. సొమ్ము నీదికాదుగా' అనుకున్నాడు.

ఖర్మకాకపోతే ఈ కార్తీకమాసం ఇప్పుడే రావాలా. ఈ ప్రకారంగా సరుకులు తెస్తే బడ్జెట్ బాదేలా వుంది.

యాభైమంది చెయ్యి కడగటం మాట అటుంచి తను, తన జీతం కదుక్కుపోవటం ఖాయం.

'ఈ గండాలత్తయ్యకు సెండాఫ్ చెప్పకపోతే నీ కొంప గుండమవటం ఖాయం' అని అంతరాత్మ హెచ్చరించింది అతగాడ్ని.

కిలో ముప్పై రూపాయలు పెట్టి తెచ్చిన బియ్యం, ముష్టి కూడా వెయ్యకుండా తను జాగ్రత్తపడుతుంటే, అయినకాడికి వచ్చిందే దక్కుట అన్నట్లుగా పనమ్మాయికి చాటుగా బియ్యం అమ్మటం, కారంకాయ చేస్తానని శనగపిండి కూరిన కాకరకాయల్ని మూకుడు నిండుగా పెట్టిన నూనెలో పడవలాగా వదలటం, మిగిలిన నూనె అనవసరం అన్నట్లుగా తూములో పారపోయటం చూసి 'అమ్మా-అమ్మా' అని నోరు నొక్కుకోవటం తప్ప నోరు ఎత్తలేకపోయాడు. ఎంత లేదన్నా అరకిలోకి తక్కువ వుండదా ఆయిల్. ఇదేమిటత్తయ్యా అన్నా

దంటే చాలు...

బంధువర్గ మొత్తంలో తన పేరు యాగీ చేసి పెడ్తుంది అసలుకి వడ్డీ కల్పించి.

ooo

ఇల్లుగుల్లయిపోతున్నా తనకేం పట్టనట్టుగా టీవీ ఛానల్స్ మార్పిడిలో మునిగిపోయిన కుందనగౌరిని చూస్తుంటే ఒంటికి కొత్తకారం రాసుకున్నట్టుగా మండుకొచ్చింది సీతాపతికి.

అసలీ ఖర్చుకి కారణం యిది కాదూ!

ఈ గండాలత్తయ్య అడుగు పెట్టిన కొంపలోని ఏ మగాడికి కూడా, సెలూన్ కెళ్ళే అవసరం వుండదు, రాదు కూడాను.

ఆ సాయంకాలం ఆఫీసునుంచి వస్తూనే సీతాపతి దిగాలుగా "ఏమిటో అత్తయ్యా పెద్దదానివి కొన్నాళ్ళుంటావను కున్నా. అనుకోకుండా ట్రాన్స్‌ఫర్ ఆర్డరు వచ్చింది. రేపే బయలుదేరాలి నా భార్యతో సహా" అన్నాడు.

"పోనీ లేరా! నువ్వు మాత్రం ఏం చేస్తావు. నాక్కూడా మరో పిలుపు వచ్చింది. మన పాలకొల్లు పాపాయమ్మ మనవడికి, కాకినాడ కాంతమ్మ మనవరాలికి సంబంధం సెటిలయిందట. ఎల్లుండే ఎంగేజ్‌మెంటని ఫోన్లమీద ఫోన్లనుకో నువ్వుండి తీరాలని. నేనీమాట చెపుదామనే లోపునే నువ్వే ఈ కబురుచెప్పి నా బరువుదించావు" అంది.

"ఈ సెల్‌ఫోనులో కార్డు అయిపోయినట్లుగా వుంది, వూరికే కుయి కుయిలాడి ఛస్తోంది తప్ప మాట వివరంగా తెలియటం లేదు. కాస్త కార్డు వేయించు నాయనా" ఏదన్నా లాభం పద్ధతుంటే చూసి వేయించమని ఖాళీసెల్ సీతాపతికిచ్చింది.

బదులు చెప్పకుండా ఏదువందల రూపాయలు బెనిఫిట్ స్కీం కింద కార్డు వేయించి, రెండు మల్లు పంచెలు ఆవిడ చేతికిచ్చి ఓ దణ్ణం పెట్టి బస్సెక్కించి పంపి మరీ వూపిరి పీల్చుకున్నాడు సీతాపతి.

"కమ్మగా వండి పెడుతున్న పెద్దావిడ్ని కావాలని పంపించారు" గొణిగింది కుందనగౌరి.

ooo


కాలింగ్ బెల్ మోగిన శబ్దానికి తలుపు తీసిన కుందనగౌరిని ఎదురుగా ఓ అమ్మాయి చిరునవ్వుతో చూసింది.

ఎవరని అడిగే లోపునే...

"నమస్తే! మీరు గౌరీ మేడం కదా. నా పేరు చామంతి. ప్రైవేటుగా డిగ్రీ చదువుతూ, పార్ట్ టైంగా ఈ కుకింగ్ సర్వీస్ చేస్తున్నాను. మీకు కుక్ కావాలని పతి సార్ చెప్పారు" అని చనువుగా వంటగదివైపు వెడుతుంటే-

ఈ కుర్రది ఏం వంట చేస్తుందా అన్నట్టుగా ఎగాదిగా చూసింది కుందనగౌరి.

కానీ కుర్రది చిన్నదయినా వంట మాత్రం అమోఘం అన్నట్టుగా వుంది చామంతి చేతి భోజనం.



## జలకన్య అందాలు

సోయగాల సుందరి ఇలియానా గ్లామర్ స్పెషల్ అనే సంగతి సినీజనాలంతా ఒప్పుకుంటారు. మరి ఆమె పర్సనాలిటీ అంత 'ఇది'గా ఎలా వుంటుందనే డౌటు ఎవ్వరైనా ఆమె దగ్గర వ్యక్తపరిచారనుకోండి... ఇలియానా సింపుల్‌గా నవ్వేస్తుంది. అదేంటీ? నవ్వడం కాదు, సీక్రెట్ చెప్పండి అన్నామనుకోండి... 'ఏం లేదండీ, నేను వాటర్ ఎక్కువగా తాగుతాను. అలాగే స్విమ్మింగ్ అంటే నాకు చాలా ఇష్టం. ఏమాత్రం ఖాళీ దొరికినా స్విమింగ్ పూల్‌లో గడపడానికి ఇష్టపడతాను, అంతే' అంటుంది ఇలియానా.

ఇల్లంతా చలాకీగా తిరుగుతూ కబుర్లు చెపుతూనే చిటికెలో కొత్త కొత్త వెరైటీ వంటలు చేస్తూ కుందనగౌరిని ఆకట్టుకుంది చామంతి.

మరింక సీతాపతి సంగతి చెప్పనలవి కాదు.

దూరంనుంచి రావటం చామంతికి యిబ్బందిగా వుండటంతో తనింట్లో ఖాళీగా వున్న ఓ రూమ్‌ను ఆమెకిచ్చి వుండమన్నాడు.

చామంతి చేతి వంట రుచికోసం, క్యారియర్ కట్ చేసి, మధ్యాహ్నం లంచ్‌కి నేరుగా ఇంటికే రావడం అలవాటు చేసుకున్నాడు.

"ఎప్పుడో వచ్చే సార్‌గారికోసం ఎందుకు మేడం ఈ వెయిటింగ్. సర్వీసుకు నేనున్నానుకదా" అంటూ వేడి వేడి భోజనం కొసరి కొసరి వడ్డిస్తూ తినిపిస్తుంటే కాదనలేకపోతోంది కుందనగౌరి.


తనకు వడ్డిస్తున్న చామంతితో "ఒక్కదానివి ఏం తింటావు, లంచ్‌కి ఎప్పుడూ కంపెనీ వుండాలని" చామంతిని కూడా తనతోపాటు కూర్చోమన్నాడు సీతాపతి.

అలా వాళ్ళిద్దరూ జంటగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ తినటం కొత్తలో పట్టించుకోలేదు కుందనగౌరి.

రాను రాను సీతాపతి నోటివెంట చామంతి నామస్మరణగా వుంది. ఉదయం లేస్తూనే చామంతీ ఈ పూట బ్రేక్‌ఫాస్టు ఏం చేస్తున్నావని, ఆఫీసుకు వెడుతూ ఆఫ్టర్‌నూన్ అయిటమ్స్ ఏమిటని అడగటం, ఆఫీసునుంచి ఫోన్ చేసి కబుర్లు చెప్పటం, శలవురోజు వచ్చిందంటే చాలు, చామంతి వంట చేస్తున్నంత సేపు వంటగదిలో కూరలు తరిగివ్వటం, మిక్సీ వేయటం లాంటి సాయం చేస్తూ చామంతికి చేరువవటం చూసి కుందనగౌరిలో కుళ్ళు మొదలయింది.

"ఆహా! ఘుమ ఘుమలాడే ఈ వేడి వేడి కొత్తిమీర రైస్ తింటుంటే స్వర్గానికి బెత్తెడుదూరంలో వున్నట్లుగా వుందనుకో. న్యాయంగా అయితే, ఇంత రుచిగా చేసిన నీ చేతికి ఓ ముద్దు పెట్టాలి. బాగుండదు కానీ, షేక్‌హ్యాండ్‌తో సరిపెట్టుకుంటా" అని ఆమెతో చెయ్యి కలపటం చూసి షాక్ తగిలినట్లుగా అన్పించింది కుందనగౌరికి.

మరొక రోజు చామంతి చేసిన కొబ్బరి- మామిడికాయ చట్నీ రుచి



చూసి

"నిన్ను చేసుకునేవాడెవడోకానీ చాలా అదృష్టవంతుడు చామంతి. అసలిలాటి చేతి వంట తినటానికి పెట్టి పుట్టాలనుకో" అని సీతాపతి పొగుడుతుంటే, ముసిముసిగా నవ్వుతూ -

"పోండి సార్! మీరు మరీను. మీ కాంప్లిమెంట్లు వింటుంటే నాకు కాంప్లాన్ తాగినంత ఉత్సాహంగా వుంటుందని" సిగ్గులు ఒలకపోస్తున్న చామంతిని చూస్తుంటే భగ్గున మండింది కుందనగౌరి మనసు.

సాయంకాలం ఆఫీసు నుంచి రాగానే కూరలకనో, సరుకులకనో చామంతిని బండిమీద తిప్పుకొస్తున్నాడు సీతాపతి.

పగలంతా వంటపని, ఇంటిపనితో అలిసిపోతున్నావు పరీక్షలు దగ్గర పడుతున్నాయని రాత్రిళ్ళు దగ్గరుండి చదివించటం, టీ కాచి మరీ ఇవ్వటం చూసి తట్టుకోలేకపోతోంది కుందనగౌరి.

మనసులో ఆవగింజలా మొదలయిన అనుమానం పెరిగి పెద్దదయి ఆనపకాయలా తయారయింది. మొగుణ్ని ఏం చేసి తన వైపు తిప్పుకోవాలా అని మధనపడసాగింది.

○○○

ఆ రోజు ఆదివారం అవటంతో లేస్తూనే పేపరు తిరగేస్తూ "చామంతి.. కాఫీ" అన్నాడు సీతాపతి.


చామంతికి బదులుగా కాఫీ తెచ్చిన భార్యను చూస్తూ-

"చామంతేది?" అన్నాడు.

"లేదు! వెళ్ళిపోయింది. ఈరోజు నుంచి చామంతి వంట కోసం రాదు. నేనే పంపించేశాను. ముందు మీరు ముఖం కడుక్కుని తయారవ్వండి. మీకిష్టమయిన ఉల్లిపాయ పెసరట్టు, ఉప్మా చేస్తున్నాను" అంది.

భార్య మాటలకు ఆశ్చర్యం నటిస్తూ...."నువ్వు వంట చేస్తావా? నీకు వంట గండం వుంది కదే!" అన్నాడు.

"ఒళ్ళు దగ్గర పెట్టుకుని చేస్తే ఏ దిక్కుమాలిన




గండాలూ దగ్గరకు రావు. అయినా ఇదేం బ్రహ్మవిద్య కాదుగా.. నేర్చుకుంటే రాకపోవటానికి. మరీ అవసరం అయితే వంటల పుస్తకం వుండనే వుంది" అంటూ పైట చెంగు బొడ్లో దోపుకుని వయ్యారంగా వంట గదివైపు వెళుతున్న కుందనగౌరిని చూస్తుంటే కన్నుల పండుగలావున్నా కలా-నిజమా అని ఓ సారి గిల్లుకుని చూసుకున్నాడు.

"ఒరేయ్ పెదనాన్నకొడకా ప్రసాదూ! ఆడదానికి ఆడదే శత్రువన్నది కచ్చితంగా నిజం. నువ్విచ్చిన అమోఘమైన టానిక్ లాంటి సలహా మా ఆవిడ వంట గండం అనే జాడ్యానికి చక్కగా పనిచేసింది. మంచి గుణాన్ని యిచ్చింది. పనిలోపని చెల్లాయి చామంతికి కూడా నా తరుపున థాంక్స్ చెప్పు" అని ఫోన్‌లో గుసగుసలాడేసి...ఆలస్యం చెయ్యకుండా ఉప్మా-పెసరట్టు కోసం వురకలేస్తూ వంట గదివైపు వెళ్ళాడు సీతాపతి.

## తెలుగుఫీల్డు నచ్చింది

తనని మొదట్నించీ ప్రోత్సాహాన్నిస్తున్న తెలుగు చిత్రసీమ అంటేనే తనకెంతో ఇష్టమని చెబుతున్న కాజల్ అగర్వాల్‌కి 'మగధీర' సినిమా విజయం అమాంతం ఆమెని పెద్ద స్టార్‌ని చేసేసింది. ప్రస్తుతం అల్లు అర్జున్‌తో 'ఆర్య-2', రామ్‌తో 'గణేష్' సినిమాల్లో నాయికగా నటిస్తున్న తనకి టాలీవుడ్‌లోనే సెటిలవుదామని వుందంటుంది. అయితే హిందీలో మంచి ఆఫర్ గనక వస్తే అక్కడ కూడా చేస్తానని చెప్పే కాజల్- భవిష్యత్తులో తెలుగు నేర్చుకున్నా తన పాత్రకి డబ్బింగ్ మాత్రం చెప్పుకోనని అంటుంది.